www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 03 | జనవరి | 2026 పేజీలు : 8

## బోల్తా పడ్డ స్కూల్ బస్సులు

రెండు ఘటనల్లో పలువురికి గాయాలు
-నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



పెనుబల్లిలో

2లో


అశ్వాపురంలో

# నేటి నుంచి సిపిఐ ప్రచార జాతాలు




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరిగే బహిరంగ సభ జయప్రదం కోరుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు ప్రచార జాతాలు శనివారం ప్రారంభంకానున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రచార జాతా శనివారం ఉదయం 10 గంటలకు చర్లలో ప్రారంభం కానుండగా ఈ జాతాను సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డా॥ కె. నారాయణ ప్రారంభించనుండగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తదితరులు పాల్గొననున్నారు. రెండవ జాతా సత్తుపల్లిలో ప్రారంభం కానుంది. ఉదయం 10 గంటలకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు జాతాను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్,

మిగతా 2లో..




-చర్లలో నారాయణ..
సత్తుపల్లిలో బాగం
-నాలుగు రోజుల పాటు
విస్తృత ప్రచారం




# ఆగని భూ మాయ..!



-దొరకని దొంగలు
-ప్రభుత్వ భూములకు రక్షణ కరువు
-పెనుబల్లిలో బయటపడిన భూ బాగోతం
-విచారణలో తీవ్ర జాప్యం
-తప్పించుకుంటున్న దోషులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భూమికి విలువ పెరిగింది. దానితో పాటు భూమి వ్యాపార వస్తువుగా మారడంతో పాటు అక్రమార్కుల కన్ను ప్రభుత్వ దేవాదాయ, ధర్మాదాయ భూములు, ప్రభుత్వ డొంకలు, కాలువలు, నిరూపయోగ ప్రభుత్వ భూములపై పడింది. రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు ఉన్నతాధికారుల సూచనలు భేఖాతర్ అంటూ కొందరు తహసీల్దార్లు ఇష్టానుసారంగా నిషేధిత భూములను సైతం రిజిస్టర్ చేస్తున్నారు. దొరికితేనే దొంగ అన్నట్లు పెనుబల్లి తహసీల్దార్ భూ బాగోతం బయటపడి విధుల నుంచి తప్పించబడ్డారు. కానీ బయటకు రాని భూ బాగోతాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చాలా చోట్ల చేసుకున్నాయి. ఆన్‌లైన్ పనులు, ఆఫ్‌లైన్ చెల్లింపుల కారణంగా చాలా మంది అధికారులు తప్పించుకుంటున్నారు. వైరా మండలంలో ప్రభుత్వ డొంకను సైతం ప్రైవేటు వ్యక్తులకు

మిగతా 2లో..

## కొన్ని చోట్ల కొరత..
# మరికొన్ని చోట్ల నిల్వలు..!




**ప్రజాపక్షం/ఖమ్మం :** యూరియా కొరతపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. యూరియా విక్రయ కేంద్రాల్లో యూరియా నిల్వలు రైతుల అవసరాలకు సంబంధించి వ్యవసాయాధికారులు సమగ్ర సమాచారాన్ని రైతులకు తెలియజేయకపోవడం అవసరమైన చోటికి యూరియాను సకాలంలో అందించకపోవడం, స్థానిక అధికార యంత్రాంగం సమన్వయ లోపం యూరియా కొరతకు కారణమవుతుంది. చింతకాని మండలంలో యూరియా నిల్వలు తక్కువగా ఉండడంతో నాగులవంచలో రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఉదయం నుంచే యూరియా కోసం బారులు తీరారు. యాసంగి వరితో పాటు మొక్కజొన్న పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. మిర్చి సహా అన్ని పంటలకు యూరియా అవసరం కావడంతో రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. చింతకాని మండలంలోని రెండు సహకార సంఘాల పరిధిలో మొత్తం కేంద్రాలలో యూరియా విక్రయిస్తుండగా నాలుగు కేంద్రాలలో యూరియా అసలు లేదు. చింతకాని, నాగులవంచ, నాగిలిగొండ, పాతర్లపాడు, రేపల్లెవాడ

-యూరియా కొరతపై చింతకానిలో ఆందోళన

గ్రామాల్లో యూరియా నిల్వలు ఉన్నప్పటికీ నిరంతరం యూరియా కోరకు కూపన్లు ఇస్తూనే ఉండటం ఇక యూరియా ఇప్పట్లో రాదేమోనన్న ఆలోచన కూడా రైతుల ఆందోళనకు కారణమవుతుంది. సింగరేణి మండలంలో ఆరు కేంద్రాలలో యూరియా పంపిణీ చేస్తుండగా ఒక్క రొట్టమాకురేవులో తప్ప ఎక్కడ యూరియా నిల్వలు లేవు. బూడిదంపాడు మండలంలో కావాల్సినంత యూరియా నిల్వ ఉంది. సత్తుపల్లి మండలంలోని అన్ని విక్రయ కేంద్రాల్లో యూరియా నిల్వ ఉంది. రఘునాథపాలెం మండలంలో యూరియా సరిపడ నిల్వలు ఉన్నాయి. ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో యూరియా నిల్వలు సరిపడ ఉన్నట్లు సమాచారం. అధికారుల సమన్వయ లోపం కారణంగానే రైతులు ఆందోళనకు దిగుతున్నారు. అవసరమైన చోటికి తగినంత యూరియా సరఫరా చేయడంతో పాటు రైతులకు అవగాహన కల్పిస్తే రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి రాదు.

# నేటి నుంచి సిపిఐ ప్రచార జాతాలు

(మొదటిపేజీ తరువాయి)
సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు. సత్తుపల్లిలో ప్రారంభమైన జాతా వేంసూరు, కల్లూరు, తల్లాడ, వైరా, పెద్దమునగాల, కొణిజర్ల, తనికెళ్ల, వి. వెంకటాయపాలెం మీదుగా ఖమ్మం చేరుకోనుంది నాలుగున ముదిగొండలో ప్రారంభమై నేలకొండ పల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో పర్యటించి వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ముగుస్తుంది. ఐదున మధిర మండలం మడుపల్లిలో ప్రారంభమై మధిర, బోనకల్ మండలాల్లో ప్రచార జాతా సాగనుంది. ఆరున ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి , రఘునాథపాలెం మండలాల్లో, ఏడున ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి, దారెడు, పడమటితండా, కామంచికల్, రామన్నపేటలో సాగనుంది. ఈ జాతాకు జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి లు నేతృత్వం వహించనున్నారు. చర్లలో ప్రారంభమైన జాతా తొలిరోజు చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల మీదుగా సారపాక వరకు సాగనుంది. నాలుగున అశ్వాపురంలో ప్రారంభమై మణుగూరు, పినపాక, కరకగూడెం, గుండాల వరకు సాగనుంది. ఐదున ఆళ్లపల్లిలో ప్రారంభమై ఇల్లందు, లక్ష్మి దేవిపల్లి, పాల్వంచ మండలాల్లో సాగనుంది. ఆరున ముల్కలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, ఏడున చుంచుపల్లి, కొత్తగూడెం, జూలూరుపాడు మీదుగా సుజాతనగర్ వరకు సాగనుంది.

# ఆగని భూ మాయ..!

(మొదటిపేజీ తరువాయి)
రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదే మండల పరిధిలోని గొల్లపూడిలోని పులిగొండ లక్ష్మి నర్సింహా స్వామి భూములపైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవుని మాన్యాలను కౌలుకు తీసుకుంటున్న కొందరికి పట్టాలు చేసి పెద్ద మొత్తంలో పుచ్చుకున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించిన తర్వాత పలు అక్రమాలు చోటు చేసుకున్నాయి. గతంలో ఇదే పద్ధతి నడవగా కొత్త పద్ధతిలోనూ పెద్ద మార్పు లేదని యధేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగి పోతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బోనకల్ మండలంలోని పలు గ్రామాల్లో అసైన్‌మెంట్ భూములు ఉన్నాయి. అనేక దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్నారు. వీరిలో కొందరి వద్ద పెద్ద మొత్తం పుచ్చుకుని పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసి మిగిలిన వారికి ప్రభుత్వ నిబంధనలను ఎకరువు పెడుతున్నారు. తమను తృప్తిపరిచిన వారికి కోరినట్లుగా పనులు జరిగిపోతున్నాయి. చాలా మండలాల్లో ఇదే పరిస్థితి కొంచెం అటు ఇటు అంతే తేడా. విచారణలో జాప్యం, భూములకు సంబంధించిన ఆరోపణలు వచ్చినప్పుడు విచారణలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ముగ్గురు కలెక్టర్లు మారినా ఓ ప్రభుత్వ భూమి విషయంలో సరైన చర్యలు తీసుకోలేదంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది. వైరా మున్సిపాలిటీ పరిధిలో ఓ వ్యక్తికి ఉన్న స్థలం కంటే మూడు రెట్లు అధిక విస్తీర్ణం రిజిస్ట్రేషన్ చేశారు. సబ్ రిజిస్ట్రార్, మున్సిపాల్ అధికారుల పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఒక రకంగా విఫలమయ్యారని చెప్పవచ్చు. ఇప్పటికే మూడేళ్లుగా ఆ ఫైలును అధికారులు పరిశీలిస్తూనే ఉన్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరగలేదు. భూ రిజిస్ట్రేషన్లు , ఆక్రమణలకు సంబంధించి సత్వర చర్యలు తీసుకునే విధంగా చట్టాలను సవరించాలి.

**దొరుకుతున్న పరికపిక్కలు -దొరకని తిమింగళాలు...**

అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) దూకుడు పెంచింది. తమకు లంచం అడిగినట్లు ఎవరైనా సమాచారం ఇస్తే పకడ్బందీగా వల వేసి పట్టుకుంటున్నారు. ఏసిబికి దొరికేవి అన్ని పరికపిక్కలే. సామాన్యులను చిన్న చిన్న పనులు చేయడానికి అడిగిన మొత్తాలను ఇచ్చుకోలేక ఏసిబిని ఆశ్రయిస్తున్నారు. తమకు చట్ట పరంగా చేయాల్సిన పనులకు లంచం అడిగినప్పుడు ఏసిబికి సమాచారం ఇస్తున్నారు. కానీ లక్షలు ముట్టజెప్పి అధికారుల చేత చట్టవిరుద్ద పనులు చేయించుకుంటున్న ఘటనలకు సంబంధించి ఏ అధికారి చిక్కడం లేదు. పెనుబల్లి భూ బాగోతంలో కోటి రూపాయలు అటు ఇటుగా చేతులు మారినట్లు ప్రచారం జరుగుతుంది. పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుంటున్న వారెవరు ఏసిబికి చిక్కడం లేదు. అంతా ఆఫ్‌లైన్‌లో నడిచిపోతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఎక్కడ ఆగినట్లు లేదు. ఇప్పటికీ కొందరు నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తున్న అధికారులు ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కానీ పని లేదు. కాకపోతే భరించే శక్తి ఉండాలి అని పైరవీకారి వ్యాఖ్యానించినట్లుగా భరించలేని వ్యక్తులకు దన్నుగా నిలిచి ప్రజల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. ఏసిబి సైతం చిన్న చిన్న వాటితో పాటు తిమింగళాలను వల వేసి పట్టుకుంటునే ప్రజలకు మేలు జరుగుతుంది.

## ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కృషితోనే గ్రామాభివృద్ధి

### విప్పలమడక సర్పంచ్ హెమీమా చక్రపాణి సంపత్




**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కృషితోనే విప్పలమడక గ్రా మాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ గ్రామ సర్పంచ్ మేడా హెమీమా చక్రపాణి అన్నారు. విప్పలమడక గ్రామంలోని 1వ వార్డులో రెండు సిసి రోడ్ల నిర్మాణానికి మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.8లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో సిసి రోడ్లు నిర్మించేందుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ మేడా హెమీమా చక్రపాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో ఇప్పటికే ఎస్సీ కాలనీలో కోటి రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. అంతేకాకుండా ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తమ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, మాజీ ఎంపిటిసి ఆకుల ప్రసాద్, ఉప సర్పంచ్ బూర్గు లూర్దమ్మ, వార్డు సభ్యులు ముత్తమాల నాగజ్యోతి, పారుపల్లి నిఖిత, గరిడేపల్లి శ్రీనివాసరావు, కాశిమాల సామేలు, బూర్గు రత్తయ్య, కొప్పుల అన్నపూర్ణరావు, బూర్గు యోహాన్, ముత్తమాల జ్యోత్న, రుద్రాక్షల రాంబాబు, గరిడేపల్లి సత్యనారాయణ, మోతుపల్లి రామారావు, లింగాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 12వ వార్డులో భట్టివిక్రమార్క వాల్‌క్లాక్ పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొదిల హరినాధ్, కాపా మురళీకృష్ణ, రంగా జనార్ధన్, ముళ్ళపాటి సీతారాములు, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పమ్మి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పమ్మి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సమకారంతో గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క గోడ గడియారాలను ప్రజలకు బహుమతిగా అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు వీరంశెట్టి సీతారాములు, రేచర్ల వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐవి.నాగేశ్వరరావు, మిట్టపల్లి శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేచర్ల మల్లీశ్వరి, నాళ్ళ నాగేశ్వరరావు, కంభంపాటి సత్యనారాయణ, తోటకూర గోపి, రేచర్ల వెంకటేష్, రేచర్ల విశ్వనాధం, షేక్ బాబు, జాని, సన్నీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బోల్తా పడ్డ స్కూల్ బస్సులు







**ప్రజాపక్షం/ఖమ్మం :** రెండు చోట్ల స్కూల్ బస్సులు బోల్తా పడిన ఘటన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటు చేసుకుంది. విద్యార్థులను తీసుకెళ్తున్న బస్సులు నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా బోల్తా పడినట్లు ప్రాథమిక సమాచారం. వేంసూరు మండలం మొద్దులగూడెం గ్రామంలో ఉన్న వివేకానంద స్కూల్ బస్సు పెనుబల్లి మండలం గణేష్‌పాడు కాలువ వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 100 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట వద్ద కెవిఎల్‌ఆర్ కళాశాల బస్సు ప్రమాదానికి గురైంది. అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒక విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. పాల్వంచలోని కెవిఎల్‌ఆర్ కళాశాలకు చెందిన ఈ బస్సులో 60 మంది విద్యార్థులు ఉండగా ఓ విద్యార్థి బస్సులో ఇరుక్కుపోయాడు. గాయపడిన మిగిలిన విద్యార్థులను వేర్వేరు బస్సుల్లో ఆసుపత్రులకు తరలించారు. ఈ రెండు ఘటనలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

### స్కూల్ బస్సు బోల్తా పై మంత్రులు విచారం...

పెనుబల్లి మండలం గణేష్‌పాడు గ్రామ సమీపంలో వివేకా నంద స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటనపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు విచారం వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఏసిపి, సబ్ కలెక్టర్ తో ఫోన్‌లో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిమితికి మించి స్కూల్ బస్సులో విద్యార్థులను తీసుకెళ్లడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాయపడిన విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు మరల పునరావృతం కాకుండా రవాణా శాఖాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షతగాత్రులకు తక్షణ వైద్య సేవలు అందేలా సహాయక చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

### పెనుబల్లిలో...

స్కూల్ పిల్లలతో వెళుతున్న స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. వేంసూరు మండలం మొద్దులగూడెంలోని శ్రీ వివేకా నంద విద్యాలయం ప్రైవేట్ స్కూల్ బస్సు స్కూల్ వదిన పిల్లలను ఎక్కించుకొని మొద్దుల గూడెం నుండి బయలుదేరి పెనుబల్లి మండలం పరిధిలోని గణేష్ పాడు సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో సుమారు వందమంది పైగా ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలు ఉన్నారు. బస్సు బోల్తా పడిన వెంటనే ఘటనాల స్థలాన్ని చేరుకున్న స్థానికులు పోలీసులకు, అంబులెన్స్ కి సమాచారం అందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో కొందరు పిల్లలకు స్వల్ప గాయాలు కాగా మరికొందరి చిన్నారులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన పిల్లలను పెనుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, తిరువూరు ఆసుపత్రికి తరలించారు. పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి ఏడు మంది చిన్నారులను తరలించి ప్రథమ చికిత్స అందించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్కూలు బస్సు బోల్తా పడడడంతో బస్సు డ్రైవర్ సహాయక చర్యల్లో చేపట్టకుండ పట్టకుండా అక్కడి నుండి పరారవడం గమనార్హం.

### అశ్వాపురంలో...



మొండికుంట గ్రామం శివారు పాలవాగు వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మణుగూరు, కొత్తగూడెం ప్రధాన రహదారిపై కేవిఎల్‌ఆర్ విద్యా సంస్థలకు చెందిన కాలేజీ బస్సు ప్రమాదానికి గురైంది. పాలవాగు సమీపంలో బస్సు అదుపు తప్పి రోడ్డు మీద నుండి చప్టా వైపు దూసుకోయింది. ఈ ఘటనలో బస్సులో సుమారు 40 మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా అందులో పలువురు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. ఒక విద్యార్థినికి చేయి తెగిపోయి పెను ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక గ్రామస్తులు, రోడ్డు పై ప్రయాణించే వాహనదారులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను బస్సు నుండి బయటకు తీసి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌ల ద్వారా భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న అశ్వాపురం తహసీల్దార్ మణిధర్, సిఐ అశోక్‌రెడ్డి, మణుగూరు డిఎస్‌పి రవీందర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సు ప్రమాదానికి గల కారణాలపై విచారణ ప్రారంభించారు. అధిక వేగమే ప్రమదానికి కారణమై ఉండవచ్చని, లేదా ఫిట్నెస్ లోపమా ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ప్రధాన రహదారిపై కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

### క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించిన రేగా...





కేవిఎల్‌ఆర్ విద్యా సంస్థల బస్సు ప్రమాదానికి గురైన సంఘటన తెలుసుకున్న పినపాక మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావు, బిఆర్‌ఎస్ నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని, విద్యార్థులకు ధైర్యం చెబుతూ గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించడంలో సహకరించారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులకు ధైర్యాన్నిస్తూ వారిని ఓదారుస్తూ స్వల్ప గాయాలైన విద్యార్థులను పరామర్శించారు. అనంతరం సంఘటన స్థలంలో వైద్య సిబ్బందికి విద్యార్థులకు వారి సహాయ సహకారాలను అందించారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు కోడి అమరేందర్, మండల బిఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సరిపోను యూరియా ఉంది.. రైతులు ఆందోళన చెందొద్దు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/కొణిజర్ల : రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరూ అధైర్యపడొద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొణిజర్ల గోపవరం సహకారం పరపతి సంఘం కార్యాలయం నందు యూరియా కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలో ప్రస్తుతం 13 వేల 180 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. మార్క్‌ఫెడ్ వద్ద 8822 మెట్రిక్ టన్నులు, ప్యాక్స్ వద్ద 917 మెట్రిక్ టన్నులు, ప్రయివేట్ డీలర్స్ వద్ద 944 మెట్రిక్ టన్నులు గతంలో స్టాక్ ఉన్న 2495 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మొక్కజొన్న పండించే ప్రాంతాల్లో యూరియా వాడకం అధికంగా ఉంటుందని అవి అధికంగా సాగుచేసే కొణిజర్ల, చింతకాని, బోనకల్, ముదిగొండ మండలాల్లో యూరియా సేల్స్ పాయింట్స్ అధికంగా ఏర్పాటుచేశామని 2 వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒక యూరియా సేల్ పాయింట్ ఉండే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. కొణిజర్ల మండలంలో 7 సేల్స్ పాయింట్స్‌కు అదనంగా మరో 9 సేల్ పాయింట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యూరియా కోసం ఏసమయంలో రావాలోవారికి ముందస్తుగా సమాచారం అందిస్తూ కూపన్లు జారీ చేస్తున్నట్లు వివరించారు. రైతులు అధికారులకు సహకరిస్తూ వారు సూచించిన సమయంలో వచ్చి యూరియా తీసుకువెళ్లాలని తెలిపారు. యూరియా దొరుకుతుందో లేదోనని అధికంగా కొనుగోలు చేసి స్టోర్ చేసుకుంటే దానియొక్క నాణ్యత తగ్గుతుందని తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి డి పుల్లయ్య, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఎం అపూర్వ, ఏడిఏ కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి బాలాజీ, తహశీల్దార్ అరుణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ అధ్యక్షుల ప్రమాణస్వీకారం



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణం బంజారా కాలనీలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ అధ్యక్షునిగా మల్లాది వాసు, రైల్వే కాలనీ రామాలయం పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షునిగా కోన జనార్దన్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం వెంకటేశ్వరస్వామి ఆలయ కళ్యాణ మండపం నందు ఘనంగా అధ్యక్షుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది దేవరపల్లి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఆలయ కమిటీ ఛైర్మన్లుగా ప్రమాణం స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, స్వామి నిర్విఘ్నంగా పూజా కార్యక్రమాలతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు, ఇతర సిబ్బంది, వివిధ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ విగ్రహానికి భూమిపూజ



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిధిలోని పల్లిపాడులో వైరా మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో దివంగతనేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ రామనాథమ్ హాజరై భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని తెలిపారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటుచేసుకోవడం సంతోషించదగ్గ విషయం అని అన్నారు. ఈకార్యక్రమంలో కొణిజర్ల టిడిపి మండల అధ్యక్షుడు తాతా సుధాకర్, వైరా నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ చెరుకూరి చలపతి, వైరా మండల పార్టీ అధ్యక్షుడు కిలారి సురేందర్, టౌన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల నాయకులు దామా శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్‌కె సైదులు, దామా వెంకటేశ్వర్లు, ఎస్‌కె అహ్మద్, పొటి నాగేశ్వరరావు, మార్కెట్‌కమిటీ మెంబర్ షెడ్డు రామారావు, చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, నంద్యాల కోటి, ఎస్‌కె దర్గా, కొమ్మినేని సత్యనారాయణ, రస్సల్ల, వీరస్వామి, గొర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/ మధిర : మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ప్రభుత్వ రంగ సంస్థ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిరిపురం శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అందే సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. నాబార్డ్ ఆర్థిక అక్షరాస్యత నిధులు సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కళాజాత బృందం వారు బ్యాంక్ ద్వారా అందించే పథకాలను వివరించారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఆర్.మహేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతిఒక్కరూ సురక్ష బీమా యోజన పథకం కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద ఏడాదికి రూ.436 చెల్లిస్తే జీవిత బీమా రూ.2లక్షల వరకు వరిస్తుందని అన్నారు. జన్‌ధన్‌ఖాతా ద్వారా జీరో అకౌంట్ ఉచితంగా తెరుస్తామని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అపరిచత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి చెప్పమని వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పొద్దన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుంప పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ సునందరావు, బ్యాంకు మిత్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ పునర్నిర్మాణం చేపట్టాలని వినతి





ప్రజాపక్షం/మధిర : మధిర పట్టణంలోని 775 సంవత్సరాల చరిత్ర కలిగిన రామాలయం శిథిలావస్థకు చేరినందున భక్తుల సౌకర్యార్థం ఆలయాని పునర్నిర్మాణం చేపట్టాలని భక్తులు విన్నవించారు. రామాలయంలో గర్భగుడి, గుడిశిఖరాలు, ధ్వజ స్తంభం, యాగశాల, పాకశాల ఆవరణం, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతోపాటు కళ్యాణ వేదిక శిథిలావస్థకు చేరటంతో రాముల వారి కళ్యాణానికి ఇబ్బందిగా ఉందని ఆలయ నిర్వాహకులు మధిర అభివృద్ధి, అడ్వైజర్ కమిటీ సభ్యులకు విన్నవించారు. డిప్యూటీసీఎం భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు మధిరలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేసే క్రమంలో అడ్వైజర్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మిరియాల రమణగుప్త, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బెజవాడ రవిబాబు, రంగా శ్రీనివాసరావు, తన్నీరు రామకృష్ణ, పారుపల్లి విజయ్‌లు శుక్రవారం రామాలయానికి విచ్చేసిన సందర్భంగా భక్తులు వినతి పత్రాన్ని అందచేశారు. రామాలయాన్ని పునర్నిర్మాణం చేసి భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విన్నవించగా భక్తుల విన్నపం మేరకు ఈ విషయాన్ని భట్టి దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కార కార్యచరణ తీసుకునే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామాలయం పూజారులు జనార్ధనాచార్యులు, నారాయణాచార్యులు, రామానుజాచార్యులు, మున్సిపాల్టీ డిఇ నరేష్‌రెడ్డి, రామాలయం మాజీ ఛైర్మన్ పుల్లఖండం సత్యనారాయణమూర్తి, పుల్లఖండం చంద్రశేఖర్, శివరాజు, చారుగుండ్ల నర్సింహామూర్తి, వంగవీటి రాజశేఖర్, బిక్కి ప్రసాద్, గద్దం మల్లికార్జున్‌రావు, పారుపల్లి వెంకటేశ్వరరావు, మాధవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 21వ డివిజన్‌లో ఐఎన్‌టియూ మహిళా కమిటీల నియామకం





ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు 21 డివిజన్ అధ్యక్షులు కోట నాగరాజు ఆధ్వర్యంలో ఇన్‌చార్జిలు పారుపల్లి విజయ్‌కుమార్, రంగా శ్రీనివాసరావు ఐఎన్‌టీయూ మహిళా కమిటీలను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే మున్సిపాల్టీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఈ కమిటీలు పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యర్రగుంట రమేష్, మొచర్ల సురేష్, అనుబోలు వెంకటేశ్వర్లు, కమతం ప్రవీణ్, గొర్రె ముచ్చు లలితకుమారి, కమతం విక్టోరియా రాణి, నంద్రు రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి టిజి టెట్ పరీక్షా కేంద్రాల వద్ద

# సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్ అమలు : సిపి




ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నేటి నుంచి జరగనున్న టీజీ టెట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్ అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు ఈ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలకు రెండు వందల మీటర్ల దూరం వరకూ ఐదుగురికి మించి ఎక్కువ మంది గుంపులు గుంపులుగా తిరగటం, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, మైకులు, డిజేలతో ప్రచారాలు నిషేదమన్నారు. పరీక్ష కేంద్రాలకు పరిసరప్రాంతాల్లోని ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ తెలిపారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచి సమాచారం ఎప్పటికప్పుడు సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

# వృద్ధురాలు అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం గ్రామం ఎస్సీకాలనీలో నిరుపేద వృద్ధ మహిళ నకిరికంటి కమలమ్మ(80) శుక్రవారం మృతి చెందింది. మృతురాలు నిరుపేద కావడంతో విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి తన కేవిఆర్ ఫౌండేషన్ ద్వారా అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయాన్ని తన ప్రతినిధులు ద్వారా మృతురాలు కుమారుడు నాగయ్యకు అందచేశారు. మంచి మనసున్న నిర్మలకుమారి గ్రామ సర్పంచ్ కావడం గ్రామస్తుల అదృష్టమని, పదవి లేనప్పుడు కూడా నిర్మలమ్మ పేద ప్రజలపై ఉదార స్వభావంతో మెలిగే వారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చట్టు పార్వతీ, వార్డు సభ్యులు కందుకూరి రవికుమార్, గద్దల స్వాతి, మాజీ జెడ్పిటిసి అంకశాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఉపాధ్యక్షులు ముల్లంగి లాజరు, నన్నపనేని రామారావు, ముల్లంగి గాబ్రియేలు, బూసిపోగు జీవరత్నం, గద్దల రాబట్టు, గద్దల జమలయ్య, కాలనీ సంఘం పెద్దలు, సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఏవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆర్డిఓ కార్యాలయంలో ఉన్న ఏవిఎం గోదామును జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోదాము వద్దకు చేరుకున్న ఆయన రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతి లేనిదే ఎవరినీ గోదాములోనికి అనుమతించరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం గదిలోని సిసి కెమేరాల పనితీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట సూపరింటెండెంట్ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గోదావరి నదీ హారతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** పున్నమి పొద్దును పురస్కరించుకుని నేడు గోదావరి మాతకు హారతి పట్టనున్నారు. నదుల విలువను తెలిపే విధంగా సాగే ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. నదులు ప్రజల జీవనానికి ఆధారంగా నిలిచాయి, నీటి వనరులు ఉన్న వద్దే నాగరికత విలసిల్లింది. సంస్కృతి సంప్రదాయాలు పరిడమిల్లాయి. ఇలాంటి గొప్ప ప్రాధాన్యత సంతరించుకున్న నదులు ఎంతో విశిష్టతను కలిగున్నాయి. భద్రాచల ప్రాంతానికి గోదావరి నదితో విడదీయరాని అనుబంధం ఉంది. ఏరు ది రివర్ ఫెస్టివెల్‌లో భాగంగా గత శనివారం గోదావరి నదీ హారతి కార్యక్రమాన్ని అట్టాహాసంగా ప్రారంభించారు. ఈ నదీ హారతి కార్యక్రమం ఇక నుండి ప్రతీ వారం భద్రాచలంలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నేటి శనివారం సాయం సంధ్య వేళ నదీమతల్లికి పంచ హారతులు పట్టనున్నారు. నదుల విశిష్టతను మరింతగా తెలిపేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఔత్సాహికులు, ప్రముఖు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చేందుకు ప్రచారం సాగిస్తున్నారు.

## సెర్ఫ్ విఓఏల వేతనం 18వేలు ఇవ్వాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** సెర్ఫ్ విఓఏల వేతనం 18వేలు ఇవ్వాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. శుక్రవారంచములకలపల్లిలో సెర్ఫ్ విఓఏల సమావేశం ముదిగొండ మహాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ఫ్‌లో వివోఏలుగా 20 ఏళ్ల నుండి డ్వాక్రా గ్రూ సంఘాలకు ఎన్నో సేవలు చేస్తూ అభివృద్ధి చేస్తున్న, నేటికి వేతనం 5వేలు ఇచ్చి కాలం వెళ్లబుచ్చుతున్నారని ఈ జీతంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 18వేలు ఇస్తామన్న హామీ అమలు చెయ్యాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈకార్యక్రమంలో దాసం కనక లక్ష్మి, ఏలూరి దుర్గా, ముదిగొండ మహాలక్ష్మి, తానం సత్యనారాయణ, సఫియా, లక్ష్మీ కుమారి, విజయ్, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రంలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ సునిల్ దత్ పోలీసు అధికారులు, హోంగార్డులు, సిబ్బంది, జిల్లా ప్రజలకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఎదురైయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ కొత్త ఉత్సహంతో ముందుకు సాగాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసుయంత్రంగం చేసిన సమిష్టికృషి ఫలితమే నేడు సంతోషకరమైన వాతావరణంలో వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. సమాజ శ్రేయస్సు కోసం జిల్లా పోలీసు యంత్రంగం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సిపి ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ప్రసాద్‌రావు, భోజా రామానుజం, ఏసిపిలు, ఆర్ఐలు, సిఐలు, ఎస్సైలు, సిపి కార్యాలయ మినిస్ట్రీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లెనిన్ శ్రీనివాస్‌కు మరో కవిత పురస్కారం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రముఖ కవి, అభ్యుదయ వాది, వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్‌కు మరో పురస్కారం దక్కనుంది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వచ్చిన కవిత్వంలో ఆయనకు ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తెలుగు మహాసభల నిర్వహణ కమిటీ ప్రకటించింది. జనవరి మూడు, నాలుగు, ఐదు తేదీలలో గుంటూరు జిల్లా అమరావతిలో తెలుగు మహాసభలు జరగనున్న విషయం విధితమే. ఈ సందర్భంగా లెనిన్ శ్రీనివాస్‌కు వచ్చిన కవిత్వంలో పురస్కారాన్ని ప్రకటిస్తూ ఆహ్వాన సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. లెనిన్ శ్రీనివాస్‌కు సాహితీ పురస్కారం దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

# ఇసుక రీచ్‌ల కోసం భారీ గాంబ్లింగ్

**- తప్పుకుంటే రూ.20 లక్షల ఆఫర్**





**ప్రజాపక్షం/చర్ల :** మండలంలో ఇసుక సొసైటీల వ్యవహారం రోజురోజుకీ ముదిరి పాకాన పడుతోంది. మండలంలో ఒక ఇసుకరీచ్ సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించడానికి ముందుగానే ఒక గ్రూపు రూ.30 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ఉపాధి కోసం ఏజెన్సీలో గోదావరి పరివాహక ప్రాంత మండలాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసింది. దీనితో గిరిజనులు పెద్ద ఎత్తున లబ్ది పొందుతున్నారు.(లారీలకు టార్పాలిన్‌లు కప్పే పనులు, ఇసుక అమ్మకాలు ప్రభుత్వం నుండి వచ్చే వాటా నిమిత్తం) ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లాను నడిపించే ముఖ్యాతిధికారులకు ఎంతో సంతృప్తి కరంగా ఉన్నా గానీ ఈ ఇసుక రీచ్‌ల ఏర్పాట్లలో లక్షలాది రూపాయిలు పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయని విమర్శలున్నాయి. ఇసుక ర్యాంపుల ఏర్పాట్లు, నిర్వహణ అనేది చర్ల ఏజెన్సీలో జూదంగా మారిందని చెప్పవచ్చు. ఈ జూదంలో చాలా మంది అమాయకులు లక్షలాది రూపాయలను పోగొట్టుకుంటున్నారు. మండలంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిని గెలిపించుకోవడం కోసం లక్షలాది రూపాయలు వెదజల్లడం వెనుక ఇసుక క్వారీ మాత్రమే ప్రధానాంశంగా మారింది. మండలంలోని తాలిపేరు అవతలి ఒడ్డున కలివేరు, సత్యనారాయణ పురం, తేగడ, లింగాల(జెట్టిగూడెం), పెద్దిపల్లి, గొమ్ము గూడెం, ఆర్‌కొత్తగూడెం, దానవాయిపేట, కుదునూరు తదితర ర్యాంపులు ఉన్నాయి. ఇందులో కొత్తగా ఏర్పాటు కాబోయే రెండు మూడు ర్యాంపుల కోసం పైరవీ కారులు పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒక ఇసుక రీచ్‌కు అయితే సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించడం కోసం నాలుగు గ్రూపులు ప్రయత్నిస్తూ రిజిస్ట్రేషన్ కంటే ముందు లక్షలాది రూపాలు ఖర్చు చేసారానే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో ఒక గ్రూపు జిల్లాకు చెందిన ఓ మంత్రి పేరు చెప్పుకుంటుండగా, మరో గ్రూపు ఎంపి పేరుతో రంగ ప్రవేశం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇవే కాకుండా మరో రెండు గ్రూపులు జిల్లా ముఖ్యనాయకుల పేర్లతో ఇసుక ర్యాంపు సొసైటీ రిజిస్ట్రేషన్ నిమిత్తం పోటీలు పడుతున్నట్లు సమాచారం. ఓ గ్రూపుకు చెందిన వారు ఆర్థికంగా బలపడిన వారు కావడంతో మరో గ్రూపును ఇసుక సొసైటీ రిజిస్ట్రేషన్ కోసం పోటీలో నుండి తప్పుకుంటే రూ.20లక్షలను ఇస్తామని బేరసారాలు చేసినట్లు సమాచారం. ఇటీవల ఈ గ్రూపుల పైరవీలు తట్టుకోలేక సంబంధిత మంత్రి వర్యులు అన్ని గ్రూపులు కలిసి వస్తేనే సొసైటీ రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా కలెక్టర్, డిసిఓలకు తెలిపినట్లుగా గుసగుసలు వినవస్తున్నాయి. మండలంలో గల ఇసుక ర్యాంపుల కోస ం పోటీలు పడుతూ విచ్చల విడిగా డబ్బులు ఖర్చు చేస్తూగ్రామాల్లో కక్ష పూర్తిత వాతావరణాన్ని తయారు చేస్తున్న పైరవీ కారుల పట్ల ప్రజలు నిరసన వ్యకం చేస్తున్నారు.

## పాల్వంచ కేఎల్‌ఆర్ బస్సు బోల్తాపై సమగ్ర విచారణ చేపట్టాలి

**సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**



**ప్రజాపక్షం/మణుగూరు:** కెఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చెందిన బస్సు శుక్రవారం మొండికుంట అడవిలో బోల్తా పడిన సంఘటనపై, అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని, ఇంజనీరింగ్ విద్యార్థులను అన్ని విధాలుగా కళాశాల యాజమాన్యం ఆదుకోవాలని, వారికి ఏం జరిగినా యాజమాన్యం బాధ్యత వహించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం జరిగిన సంఘటనపై వారు స్పందిస్తూ కళాశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని, 40 మంది విద్యార్థులు ఎక్కాల్సిన బస్సులో 60 మంది విద్యార్థులను ఎలా ఎక్కించారని వారు ప్రశ్నించారు. రెండు బస్సులు వేసి నడపాల్సిన విద్యార్థులను కేవలం ఒకే బస్సుతో రోజు ఇరుకు తో విద్యార్థులు బస్సు ఎక్కిస్తున్నారని, ఇద్దరు కూర్చోవాల్సిన సీట్లలో ముగ్గురు, నలుగురు కూర్చోబెడుతూ విద్యార్థుల ఇబ్బందుల గురి చేస్తున్నారని నిలబడి విద్యార్థులు ప్రయాణం చేయాల్సి వస్తుందని ఈ విషయంపై, యాజమాన్యం దృష్టికి అనేకసార్లు విద్యార్థులు తీసుకెళ్ళినా ప్రిన్సిపల్ సంబంధిత యాజమాన్యం స్పందించలేదని, కావాలనీ వేరే బస్సులను వేయకుండా ఉన్న బస్సుల్ని విద్యార్థిని ఎక్కించి ఇబ్బందుల గురి చేస్తున్నారని, అసలు ఈ బస్సులకు ఫిట్నెస్ ఉందా లేదా దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. యాక్సిడెంట్ జరిగి విద్యార్థులు అర్ధనాదాలు చేస్తుంటే కనీసం ప్రిన్సిపల్ అంత దూరంలో నుండి చూస్తున్నారు తప్ప విద్యార్థులు ఓదార్చే పరిస్థితిలో లేరని వారన్నారు. వేరే ఎవరికో జరిగినట్టు దూరంగా నుండి చూడడం ఏమిటన్నారు.. కళాశాల యాజమాన్యం ఇంత జరుగుతున్న కనీసం వారిని పట్టించుకోలేదన్నారు. విద్యార్థులను బస్సు ఎక్కే కానుండి సురక్షితంగా కళాశాలకు తీసుకెళ్లి మరల ఇంటి కాడ దింపే బాధ్యత యాజమాన్యం తీసుకోవాలి కానీ విద్యార్థులను పట్టించుకోకుండా వారి ప్రాణాలతో జీవితాలతో చెలగాటమాడుతున్న కేఎల్‌ఆర్ కళాశాల యాజమాన్యం పై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని, దెబ్బలు తగిలిన విద్యార్థులను వైద్య ఖర్చులు మొత్తం కళాశాల యాజమాన్యం భరించాలని, దీనికి బాధ్యత యాజమాన్యం వహించాలని వారు డిమాండ్ చేశారు.ఇప్పటికైనా సీట్లకు సరిపడా విద్యార్థుల ను ఎక్కించి ,ఫిట్నెస్ కలిగిన బస్సులను నడపాలని, అర్హత కలిగిన డ్రైవర్లు నడిపే విధంగా చూడాలని వారూ కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, ఏఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల, భిక్షం గడ్డం వెంకటేశ్వర్లు కోశాధికారి కొత్తపల్లి సీతారాములు ఎస్వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భూవివాదాలతో వృద్ధురాలి హత్య



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** భూ వివాదాల నేపథ్యంలో వృద్ధురాలు హత్యకు గురైన సంఘటన ఖమ్మం నగరంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన మోటే రాములమ్మ(70) యాదగిరి దంపతులు బతుకుదెరువుకు ఖమ్మం వచ్చి బొక్కల గడ్డ ప్రాంతంలో నివాసముంటూ జీవనంసాగిస్తున్నారు. యాదగిరి సోదరులకు నాతాళ్లగూడెంలో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని యాదగిరి మరణానంతరం భార్య రాములమ్మ తనకూతురు పేరున రాసింది. ఈ విషయంలో యాదగిరి సోదరుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో రాములమ్మ కూతురు ఆ భూమిని సాగుచేసుకుంటుండదంతో యాదగిరి సోదరుల కుటుంబాల మధ్య వివాదం మరింత ముదిరింది. ఈ విషయంలో గ్రామ పెద్దలు ఇటీవల పంచాయతీ చేసి వివాదం సద్దుమనిగే వరకూ ఆభూమిని ఎవరూ సాగుచేయవద్దని తీర్మానించారు. అయినప్పటికి రాములమ్మ కూతురు భూమిని మరోమారు సేద్యం చేసింది. ఈ విషయం రాములమ్మ మరిది కొడుకు శేఖర్ కూడా పంచాయతీకి దిగాడు. గురువారం సాయంత్రం శేఖర్ ఖమ్మంలో ఉంటున్న పెద్దమ్మ అయిన రాములమ్మ ఇంటికి వచ్చాడు. ఆసమయంలో ఆమె ఇంటి ముందు మిరపకాయలకు దొడిమలు తీసుండగా శేఖర్ అమెను భూమి గురుంచి వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగక వెంట తెచ్చుకున్న కత్తితో రాములమ్మ చాతిలో బలంగా పొడిచాడు. ఆమె అక్కడిక్కడే ప్రాణాలు కోల్పొయింది. ఆసమయంలో అక్కడే ఉన్న మహేష్ అనే వ్యక్తి శేఖర్‌ను నిలువరించేందుకు యత్నించగా శేఖర్ అతనిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. అక్కడి నుంచి త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఘటనా స్థలానికి చెరుకున పోలీసులు పంచనామ నిర్వహించి అనంతరం మృతదేశాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించారు. అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికంగా కలకలం రేపింది. త్రీటౌన్ సిఐ మోహన్‌బాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిపిఐ వందేళ్ల ఉత్సవ సభకు ఉప్పెనలా కదిలి రావాలి

**- 18న ఖమ్మంలో జరగనున్న సభ ప్రజా ఉద్యమాలకు మరింత ప్రేరణ : సాబీర్ పాషా**







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ శత వసంతాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 18న ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగ సభకు జిల్లా ప్రజలు ఉప్పెనలా కదిలిరావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్లో శతాబ్ది ఉత్సవ వేడుకలకు సంబంధించిన ప్రచార గోడప్రతులను శుక్రవారం ప్రదర్శించి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల ఉత్సవ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఐదు లక్షల మందితో ప్రజా ప్రదర్శన, కళా ప్రదర్శనలు ఉంటాయని, జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకత్వం సభలో పాల్గొంటారన్నారు. బహిరంగ సభ విజయవంతం అయ్యేందుకు ఈనెల 3 నుండి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార జాత చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఐ జాతీయ నాయకులు, పార్టీ కంట్రోల్ కమీష్ కేంద్ర కమిటీ చైర్మన్ డా.కె.నారాయణ ప్రచార జాతాను చర్లలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 7న సుజాతనగర్‌లో జరిగే జాత ముగిం పు సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శ, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ముఖ్యాతిధిగా హాజరువుతున్నట్లు తెలిపారు. సిపిఐ వందేళ్ల చరిత్ర పోరాటాలతో ముడిపడి ఉందని, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం సాగిన ఉద్యమాలే పార్టీకి అసలైన బలమన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కార్పోరేట్ దోపిడీకి వ్యతిరేకంగా సిపిఐ ఉద్యమం మరింత బలపడేందుకు వందేళ్ల ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ఈనెల 18న ఖమ్మం నగరంలో జరగనున్న బహిరంగ సభ చారిత్రకంగా నిలవనుందని, సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వందేళ్ల ఉత్సవాలు కేవలం వేడుకలు కాకుండా భవిష్యత్ పోరాటాలకు దిశా నిర్దేశం కావాలన్నారు. ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త బహిరంగ సభను జయప్రథం చేసేందుకు బాధ్యత వహించాలని, వందేళ్ల ఉత్సవాలు ప్రజా ఉద్యమాలకు నూతన ఉత్సాహాన్ని నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జి వీరస్వామి, దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, రాములు, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణచారి, ధనలక్ష్మి, షాహీన్, మాతంగి లింగయ్య, మల్లయ్య, భూక్య ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ప్రచార జాతాను విజయవంతం చేయండి

**- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి**



**ప్రజాపక్షం/మణుగూరు:** జనవరి 18వ తేదీన ఖమ్మం లో జరిగే సిపిఐ 100 సంవత్సరాల ముగింపు వేడుకలను విజయవంతం కోరుతూ ఈనెల 3 వ తేదీన చర్లలో ప్రారంభమైన ప్రచార జాత బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు మీదుగా పినపాక నాలుగో తేదీ నాలుగు గంటలకు చేరుకుంటుందని ప్రధాన రహదారి కోడలు మీటింగ్ ఏర్పాటు చేసుకొని, పినపాక మీద నుండి కరకగూడెం నుండి ఆళ్లపల్లి గుండాల కు చేరుకుంటుందని, చర్ల నుండి ప్రారంభమైన ఈ ప్రచార జాత విజయవంతం చేయాలని సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం బయ్యారం క్రాస్ రోడ్ లో సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పినపాక మండల కార్యదర్శి పద్మనాభ రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సరెడ్డి పుల్లారెడ్డి పాల్గొని ప్రసంగిస్తూ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా కమ్మలు పెద్ద ఎత్తున 5 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నామని దీనిని విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా సిపిఐ పార్టీ కార్యకర్తలు ప్రచార జాత నిర్వహిస్తున్నారని దీన్ని విజయవంతం చేయాలని జనవరి 18వ తేదీన జరుగు బహిరంగ సభకు నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు పత్తిపాటి నాగేశ్వరరావు, గడ్డం మనోహర చారి, మండల కార్యదర్శి పద్మనాభ రాజు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గడ్డం వెంకటాచారి ,ఏఐటీయూసీ మండల కార్యదర్శి తోగటి కుమార్, ఐలయ్య రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు లింకేజి లక్ష్యాలను పూర్తిచేయాలి



**ప్రజాపక్షం/చింతకాని :** బ్యాంకు లింకేజి లక్ష్యాలను త్వరిత గతిన పూర్తి చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని డిఆర్‌డీవో సన్యాసయ్య పేర్కొన్నారు. శుక్రవారం చింతకాని శ్రీ చెన్నకేశవ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐకేపి కార్యక్రమాలు, ఇందిరా డైరీ కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సన్యాసయ్య మాట్లాడుతూ బ్యాంకు లింకేజి లక్ష్యాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని, నూతన సంఘాల ఏర్పాటులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. సిబ్బంది వారిగా ప్రగతిని సమీక్షించారు. ఇందిరా డైరీ లో ఎస్టీ , మైనార్టీ లబ్దిదారుల లిస్ట్ తయారు చేసి ఎంసీపీలు సిద్ధం చేయాలని, లబ్దిదారులందరూ పశువుల షెడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని, నిర్మాణంలో ఉన్న షెడ్లు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. అనంతరం చింతకాని గ్రామంలో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఏపీఎం నాగపుల్లారావు, ఏపీవో కోటయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఐకేపీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది రాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి




**ప్రజాపక్షం/చింతకాని :** విద్యార్దులు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి కె రవిబాబు పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా నాగులవంచ జూనియర్ కళాశాల విద్యార్దులు మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యాక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ విద్యార్దులు నిర్దిష్టమైన ప్రణాళికతో గ్రామప్రజల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,ఆరోగ్య నియమాలపై చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు.తిరుమలాపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ నేటి యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని అవి పట్టణాలు దాటి పల్లెల్లో కూడా ప్రవేశించాయని వాటి వల్ల కలిగే అనార్థాలను గ్రామంలోని ప్రతి ఒక్కరికీ తెలిసే విధంగా అవగాహన కల్పిస్తూ సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాస్ కళాశాల ప్రిన్సిపల్ నవీన్‌బాబు , ఉపసర్పంచ్ నాగమణి,పంచాయతీ కార్యదర్శి ఉమారాణి విద్యార్దులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల స్టాక్ తనిఖీ





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో ఉన్నటువంటి ఎరువుల దుకాణాల స్టాకులను మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్ తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాలలో మొత్తంగా కలిపి 1320 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నదని, ప్రస్తుత యాసంగి సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నదని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతే కాకుండా యూరియా కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, యాసంగిలో వారు వేసిన పంట యొక్క విత్తనాల బిల్లుల ఆధారంగా వారు ఎరువులను పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఫర్టిలైజర్ మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు.

## టిఎస్ యుటిఎఫ్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం డైరీ, క్యాలెండర్‌ని మండల విద్యాశాఖ అధికారి కే శాంతారావు, మర్కోడు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బి బాబులాల్ ఆవిష్కరించారు. స్థానిక జెడ్‌పిహెచ్ఎస్ మర్కోడు పాఠశాలలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిం చిన అనంతరం ఎంఈఓ కే శాంతారావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మేలు జరగాలని కోరుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క విద్యా ప్రమాణాలు సాధించే విధంగా కృషి చేస్తూ మంచి సత్ఫలితాలను సాధించాలన్నారు. ఇదే సందర్భంగా పదో తరగతి విద్యార్థులు యొక్క ప్రణాళిక బద్ధమైనటువంటి కార్యాచరణ ఏర్పాటు చేసుకొని మార్చిలో జరగబోయే పబ్లిక్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్స్ ఎల్ రాందాస్, ఎం శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాతిరామ్, మండల నాయకులు రమేష్, వేణు, శారదామని, ప్రేమ్ కుమార్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన పంచాయతీ కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని రేపల్లె వాడ గ్రామంలో నూతన పంచాయితీ కార్యాలయాన్ని సర్పంచ ఇర్పా స్రవంతి ప్రారంభించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో గల ఖాళీగా ఉన్న పాఠశాల భవనంలో పంచాయితీ కార్యాలయం ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ స్రవంతి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పంచాయితీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు దుర్వినియోగం కాకుండా అభివృద్ధికి వెచ్చిస్తామని తెలిపారు. నాతోటి పాలకవర్గంతో కలిసి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈసందర్భంగా మండల అధికారులు, గ్రామస్తులు సర్పంచ్ స్రవంతితో పాటు ఉపసర్పంచ్ గాలి పద్మ, వార్డు సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, బిఆర్ఎస్ నాయకులు సత్తి నాగేశ్వరరావు, మార్తి సత్యనారాయణ, నడివి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మద్దుకూరు పంచాయతీ అభివృద్ధే ధ్యేయం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మద్దుకూరు గ్రామ పంచాయితీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సర్పంచ్ కొడెం కృష్ణవేణి అన్నారు. శుక్రవారం గ్రామంలో పల్లె ప్రకృతి వనం పునరుద్ధరణ పనులకు ఆమె భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పంచాయితీ పాలకవర్గం పల్లె ప్రకృతి వనాన్ని నిరుపయోగంగా మార్చడంతో చెట్లని ఎండిపోయి దర్శనమిస్తున్నాయని, దీనిపై స్పందించిన గుంపెన సొసైటీ మాజీ వైస్ ఛైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ ఆర్థిక సహకారంతో పల్లె ప్రకృతి వనాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పంచాయితీని అభివృద్ధి చేసేందుకు తనవంతుగా కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ బడికల శ్రావణ్ కుమార్, వార్డు సభ్యులు కుంజ అశ్వనీ, అద్దం కనకమహాలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుల్‌కు సిపి అభినందనలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆర్మ్డ్ రిజర్వుడ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 2012 బ్యాంచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు టి.రాము, టి.రవిలు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదొన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరికి శుక్రవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో సిపి సునిల్‌దత్ హెడ్‌కానిస్టేబుల్ చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పదోన్నతులు బాధ్యతలను మరింత పెంచుతాయని అన్నారు. విధి నిర్వాహణలో అంకితబావంతో పనిచేసి మన్ననలు పొందాలని ఆయన ఆకాంక్షంచారు.

# ఉద్యోగులకు మెరుగైన వసతులు కల్పించాలి

**-హరిత హోటల్‌కు అనువైన స్థలాన్ని సేకరించాలి**
**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజా సేవలలో నాణ్యత పెంచే దిశగా ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఉన్న వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం సందర్శించారు. బస్‌డిపో రోడ్డులోని డిఆర్‌డిఏ భవనం, ఆర్అండ్‌బి ఇంజనీరింగ్ కార్యాలయం, బాల రక్షా భవన్, గిరిజన భవనం, ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బందితో కలెక్టర్ నేరుగా మాట్లాడి మౌలిక వసతులు, పని వాతావరణం, సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ భవనాల స్థితిగతులు, మరమ్మతుల అవసరం, విద్యుత్, నీటి సౌకర్యాలు, పారిశుధ్యం, ఫర్నీచర్ వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయంలో మౌలిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యతనిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయ భవనాల మరమ్మతులు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై శాఖల వారీగా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి తక్షణమే సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం మెరుగైన విడిది. భోజనం, వసతి కోసం నూతనంగా నిర్మించనున్న హరిత హోటల్‌కు అనువైన ప్రదేశం కావాల్సిన స్థల సేకరణకు ఖమ్మం కేంద్రంలో ఎన్నెస్పి క్యాంపుతో పాటు పలు ప్రాంతాల ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు అనుగుణంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, సర్వేయర్లు నాగేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యే సమాజాభివృద్ధికి పునాది

**-చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్**
**-విద్యార్థులకు సామగ్రి పంపిణీ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యతో సమాజాభివృద్ధికి పునాది అని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భద్రాచలం సర్కిల్ డా॥ భీమా నాయక్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా మిఠాయిలు, బహుమతులు బదులు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటి సామగ్రి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రం సింగ్ కూడా అటవీ శాఖాధికారులు, సిబ్బంది, ప్రజలకు అదే పిలుపునిచ్చారు. వారి పిలుపు మేరకు వచ్చిన పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సిసిఎఫ్ డా॥ భీమానాయక్, డిఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రం సింగ్, ఎఫ్‌డివో మంజుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీమా నాయక్ మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో శైలజలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు కె. పద్మజ తదితరులు పాల్గొన్నారు.


**అన్నం ఫౌండేషన్‌లో అల్పాహారం పంపిణీ...**

సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. సిసిఎఫ్ భద్రాద్రి సర్కిల్ డా॥ భీమా నాయక్, డిఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రం సింగ్, ఎఫ్‌డివో మంజుల తదితరులు పాల్గొని అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అన్నం శ్రీనివాసరావు సేవలను అభినందిస్తూ శాలువతో ఘనంగా సన్మానించారు. అన్నం ఫౌండేషన్‌లో వంట తయారీకి అవసరమైన వనరులను సేవాభావంతో అందజేసిన సామిల్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారుల సమక్షంలో ఆరు టన్నుల వంట చెరుకును అందజేశారు.

# అతి నిర్లక్ష్యం.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

**-రెండు రోజులుగా మద్యం మత్తుల్లో డ్రైవర్**
**-నిర్లక్ష్యమే ప్రమాదానికి ప్రధాన కారణం**
**-విద్యార్థులకు తీవ్ర గాయాలు**







**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వేంసూరు మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన వివేకానంద స్కూల్ బస్సు ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రతిరోజులాగే పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లేందుకు బయలుదేరిన బస్సు, పెనుబల్లి మండలం గణేష్ పాడు సమీపంలోని ఎన్ఎస్‌పీ కాలువ దగ్గర అదుపు తప్పి బోల్తా పడటం ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పినప్పటికీ, విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు నిర్వహణలో చోటు చేసుకున్న నిర్లక్ష్యం వెలుగులోకి రావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామర్థ్యానికి మించి పిల్లలు ప్రమాద సమయంలో బస్సులో అనుమతించిన సంఖ్యకు మించి పిల్లలను ఎక్కించుకున్నట్లు సమాచారం. ఇది స్కూల్ యాజమాన్యం, బస్సు నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్లల భద్రతపై కనీస శ్రద్ధ లేకుండా, లాభాల కోసమే ఇలాంటి ప్రమాదకర చర్యలకు పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం మత్తులో డ్రైవర్‌స్థానికుల కథనం ప్రకారం బస్సు డ్రైవర్ గత రెండు రోజులుగా మద్యం మత్తుల్లో ఉన్నాడని, ప్రమాద సమయంలో కూడా డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ,యాజమాన్యం,డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇది నిజమైతే, ఇది కేవలం ప్రమాదం కాకుండా ఘోరమైన నేరంగా పరిగణించాల్సిన అంశమని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారీలో ఉండటం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ప్రజల అప్రమత్తత ప్రమాదాన్ని గమనించిన గణేష్ పాడు గ్రామస్థులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించటంతో పాటు తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. వారి అప్రమత్తత వల్లే మరింత పెద్ద ప్రమాదం తప్పింది. ప్రస్తుతం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

**పిల్లల రవాణాపై పర్యవేక్షణ ఎక్కడ..?**

ఈ ఘటన మరోసారి స్కూల్ బస్సుల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. డ్రైవర్లపై సరైన వైద్య పరీక్షలు జరుగుతున్నాయా?బ స్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, అనుమతులు సక్రమంగా ఉన్నాయా? విద్యాశాఖ, రవాణాశాఖల పర్యవేక్షణ వాస్తవంగా అమలవుతోందా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

**నిర్లక్ష్యానికి ముగింపు ఎప్పుడు?**

పిల్లల ప్రాణాలు విలువైనవని, వాటితో ప్రయోగాలు చేయడానికి ఎవరికీ హక్కు లేదని ఈ ప్రమాదం మరోసారి గుర్తు చేస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, సంబంధిత శాఖలు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# 250 మందిపై డ్రంక్అండ్‌డ్రైవ్ కేసులు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నూతన సంవత్సరం సందర్భంగా బుధ, గురు రెండురోజులు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్అండ్‌డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 76 మంది పట్టుబడగా కమిషనరేట్ వ్యాప్తంగా చేపట్టిన తనిఖీలలో 250 మంది పై కేసుల నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చేపడతున్న తనిఖీల్లో ఇటీవల మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖాలు చేశామన్నారు. వారికి శిక్ష విధించడంతో పాటు రెండు నుంచి మూడు వేలరూపాయల వరకూ జరిమానాలు విధించారని ఆయన తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని గోవిందాపురం గ్రామ సర్పంచ్ మంద కరుణ శుక్రవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులను, చిన్నారుల తల్లులకు బాలమృతం ప్యాకెట్లను ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి మెనూ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.మురళీ, పాఠశాల ప్రిన్సిపాల్ పిడి నారాయణరావు, టీచర్ బాలస్వామి, అంగన్వాడీ టీచర్ కళ్యాణపు రాణి, పగడల జయలక్ష్మి, పుచ్చకాయల అంజలి, కొత్తపల్లి రమేష్, బెల్లకొండ వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ తల్లాడ :** స్థానిక మండల కేంద్రంలో పిఆర్‌టియు తెలంగాణ క్యాలెండర్‌ను తల్లాడ మండల విద్యాశాఖ అధికారి నెమ్మకంటి దామోదర్‌ప్రసాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం ఆవిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాయల నర్సింహారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, 6 డిఎలను చెల్లించాలని, నూతన పిఆర్సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉంగరాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అద్దంకి గోపాలకృష్ణ, నూతనకల్ హెచ్ఎం ఎ.రమేష్, మండల కార్యవర్గ సభ్యులు కె.భాస్కర్, వెంకటేశ్వరరెడ్డి, మండల మహిళా సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తల్లాడ ఎస్సై ఎన్. వెంకటకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం తన సిబ్బందితో పినపాక గ్రామశివారులో కోడి పందెల స్థావరంపై దాడి చేయగా 8మందిని అదుపులోకి తీసుకుని 2కోళ్లు, 5ద్విచక్ర వాహనాలు, రూ.1500నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రిఫ్రిజిరేటర్ పేలి ఇల్లు ధ్వంసం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఇంట్లో ఫ్రిజ్ పేలి ఇల్లు మొత్తం ధ్వంసం అయ్యి రెండు కుటుంబాలు కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రమైన పెనుబల్లిలో పానెం ప్రకాష్ వెంకటేశ్వరరావులు ఇద్దరు అన్నదమ్ములు ఒక ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆ కుటుంబ సభ్యులు అందరూ శుక్రవారం ఉదయం పనుల నిమిత్తం బయటకు వెళ్లారు ఆ సమయంలో విద్యుత్ సర్క్యూట్ తో ఫ్రిజ్ పేలి ఇంట్లో ఉన్న బీరువాలు,మంచాలు, టీవీలు, బట్టలు, బీరువాలో ఉన్న ఇతర సామాగ్రి మొత్తం ధ్వంసం అయ్యాయి ఇంట్లో రెండు నిండు గ్యాస్ బండలు ఉన్నాయి. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఫైర్ ఇంజన్ లో సకాలంలో వచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పెనుబల్లి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కట్టుబట్టలతో బయటపడ్డ ఆ కుటుంబాలను పెనుబల్లి మండల ప్రజలు దాతలు అనేక రకాలుగా ఆదుకొని అండగా మేమున్నామంటూ సహకరించటం ఆ కుటుంబానికి బాసటగా నిలబడటం ఆ కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. మొత్తం ఆస్తి నష్టం రెండు కుటుంబాలకు సంబంధించి నాలుగు లక్షల వరకు ఉంటుందని రెవిన్యూ అధికారులు అంచనా వేశారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలు

**-అడ్వాన్స్ టికెట్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం నూతన బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక అడ్వాన్స్ టికెట్ బుకింగ్ రిజర్వేషన్ కౌంటర్‌ను రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టికెట్ బుకింగ్ విధానంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్, భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్య, బస్టాండ్ కంట్రోలర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత ఎరువుల దుకాణం ఘరానా మోసం

-కల్తీ మందుల అమ్మకం ఎండిన మిరప తోట
-రైతు మామిడి తిరుమలేష్ గౌడ్ వే(రో)దన
-పోలీసులకు ఫిర్యాదు
-లైసెన్స్ లేని మందుల అమ్మకం పట్టించుకోని అధికారులు









**ప్రజాపక్షం/కూసుమంచి:** ఆ పేరులోనే అన్నదాత, వ్యాపారంలో విషపుదూత, నిలువెత్తు మోసపు దూత, రైతులంటే చిన్న చూపు ధర అహంకారమే ధీమా, వ్యాపారం ఎప్పుడు చైనా వస్తువుల పద్ధతుల్లోనే అమ్మకం(రైతు తిరిగి వచ్చి అడిగితే మొహం చాటేసుడే)లైసెన్సు ఉన్న అనుమతి లేనివి మందులెన్నో, ఆయనను ఎవ్వరు ప్రశ్నించలేరు, (అధికారులైన, ప్రజాప్రతినిధులైన)ఎన్నో జీరో వ్యాపారాలు చేస్తాడు అందరూ మూస్తారు వెలుగులోకి ఒక్కటి రాదు అడగలేని బక్క రైతులు, నోట్లో నాలుక లేని పేద రైతులు ఆయనను చూస్తే నోటి నుంచి మాటే రాదు. రైతులకు ఏదైనా సందేహం వచ్చి అడిగితే గద్దిస్తాడు, అరుస్తాడు, బెదిరిస్తాడు, గెంటేస్తాడు, ఇంకేదైనా చేస్తాడు, అప్పుడు, ఇప్పుడు, మరెప్పుడైనా ఆయనకు ఇది మొదటి సారి కాదు చివరి సారి అంతకాన్ని కాదు ఎందరో రైతుల హృదయాలను నుండి వినిపించే వ్యధలు గాధలు, వివరాల్లోకి వస్తే మండల కేంద్రం మెయిన్ రోడ్డులో గల అన్నదాత ఎరువుల దుకాణం(ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్)ఘరానా మోసం చేసిందంటూ ఓ రైతు ఆవేదన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లా మోతే మండలం హుషానాబాద్ గ్రామంకు చెందిన మామిడి తిరుమలేష్ గౌడ్ అనే ఓ ఒక్క రైతు కూసుమంచి మండల కేంద్రంలో అన్నదాత ఎరువుల దురాణంలో మిరప తోటకు పురుగుల మందులు కొనుగోలు చేశాడు.

### కల్తీలీ మందుల ఎండిన మిరప తోట...

మామిడి తిరుమలేష్ గౌడ్ రైతు 2025 డిసెంబర్ 3న పురుగుల మందులు కొనుగోలు చేసి డిసెంబర్ 8న స్ప్రే చేశాడు. నాలుగు రోజుల తర్వాత అనగా డిసెంబర్ 12 వరకు తోట మొత్తం ఎండిపోతున్నట్లు కనిపించింది ఇంతలోనే గ్రామ పంచాయితీ ఎన్నికలు ఉన్నందున పరిశీలిస్తున్న క్రమంలో డిసెంబర్ 12,14,16వరకు అలాగే పరిశీలన చేసిన రైతు సదరు ఎరువుల దుకాణదారుడుకి జరిగిన మిరప తోట దుస్థితిని తెలపగా దుకాణాదారుడు (కూరపాటి రఘునాధరావు) భయపడి రైతుతో ఎక్కడ చెప్పవద్దు ఏమి కాదంటూ 19,19,19 అనే మందును స్ప్రే చేయమని తానే ఆత్రంగా మందును ఫ్రీగా పంపించి కొట్టించిన ఏం ఫలితం లేకపోయింది.

### బక్క రైతు గుండె కోత...

ఎండిపోయిన చేనును చూస్తూ విలపిస్తూ రైతు మామిడి తిరుమలేష్ గౌడ్ మరో సారి దుకాణదారున్ని సంప్రదించగా చెట్టుకాయలు కొస్తే ఇగురు వస్తుందని చెప్పగా మళ్లీ రైతు ఎండిన మిరప చెట్ల కాయలు తెంపిన ఏం ప్రయోజనం లేకపోయిందని మళ్లీ కూసుమంచి దుకాణదారుడుకి తెలిపినాడు ఇక అన్నదాత ఎరువుల దుకాణ యజమాని కూరపాటి రఘునాధరావు చేసేది ఏమీ లేదని మొఖం చాటేస్తూ తన కొడుకు సందీప్‌కు ఫోన్ ఫార్వర్డ్ చేస్తూ తండ్రి కొడుకులు రైతుతో మాకు ఎటువంటి సంబంధం లేదని నీవే ఏదో తప్పు చేసి ఉంటావు అంటూ దాటవేత సమాధానాలు చేప్తూ త్రీ స్టార్ అనేది ప్రోటీన్ మందు అంటూ అది ఆన్లైన్‌లో అమ్మకాలు జరుగుతాయని ఒక సారి ఒక మాకు ఎటువంటి సంబంధం లేదంటూ రైతుని నిర్లక్ష్యం చేస్తూ పట్టించుకోవడం లేదని రైతు తన ఆవేదన వ్యక్తం చేశారు.

### బాధిత రైతు మీదనే బండలు....

కూసుమంచి ఎరువుల దుకాణంలో రైతు మామిడి తిరుమలేష్ గౌడ్‌కు అమ్మిన మందులనే అనేక మంది రైతులకు అమ్మడం జరిగిందంటే నీవు ఏదో చేసి ఉంటావని రైతు మీదనే దుకాణాదారుడు అనేక నిందలు వేస్తూ మాకు ఎటువంటి సంబంధం ఉండదు అంటూ ముందుగానే వివిధ రకాలుగా పలువురిని ఆకట్టుకునే ప్రయత్నంలో ఉన్నట్టు రైతు తిరుమలేష్ గౌడ్ తన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తను గత మూడు సంవత్సరాల నుండి నమ్మకంతో ఇదే షాపులో అనేకసార్లు పురుగుమందులు విత్తనాలు కొనుగోలు చేశానని అయినా తను తప్పు చేశాడంటూ నిందలు వేయడం సరికాదంటే రైతు మామిడి తిరుమలేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

### అన్నదాత ఎరువుల దుకాణం వారి వివరణ....

మామిడి తిరుమలేష్ రైతు మిరప తోట ఎండిపోయిన సంఘటనపై అన్నదాత ఎరువుల దుకాణం బాధ్యతులు సందీప్‌ను ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా మా దుకాణంలో త్రిస్టార్ పురుగు మందును అనేక గ్రామాల్లో ఎంతో మంది రైతులకు అమ్మినామని దానిని వాడుతున్నారని ఎక్కడ కూడా కంప్లైంట్ లేదని త్రిస్టార్ మందు ఆర్గానిక్ అని అది ఆన్లైన్‌లో కూడా కొనుగోలు చేయవచ్చని అంతిమంగా మేము చేయగలిగేది ఏమీ లేదని, అది రైతు ఏదో తప్పు చేసి ఉండటం వల్ల మిరప తోట ఎండిపోయి ఉంటుందని అయినా ఒక సారి మూడు పంతొమ్మిది మందు ఇచ్చి కూడా ఒక ప్రయత్నం చేశామని కనుక మాకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

### కూరపాటి రఘునాధరావుపై పోలీసులకు ఫిర్యాదు

కూసుమంచిలోని అన్నదాత ఎరువుల దుకాణ యజమాని కూరపాటి రఘునాధరావు కల్తీ మందులు అమ్మడం వల్లనే తన ఒక ఎకరం మిరప తోట ఎండిపోయిందని ఆరోపిస్తూ 2025 డిసెంబర్ 31 సూర్యపేట జిల్లా మోతే మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు మామిడి తిరుమలేష్ గౌడ్ తెలిపారు. ఇంకా ఈ విషయంపైనే తన స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారికి, ఆర్టికల్చర్ అధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

### ఏవో వాణి వివరణ...

కూసుమంచి అన్నదాత ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణంలో మామిడి తిరుమలేష్ గౌడ్ రైతుకు జరిగిన సంఘటనపై కూసుమంచి మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణిని ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా తాను ఈ విషయంపై అన్నదాత ఎరువుల దుకాణమును పరిశీలించానని, వారు అనేక మందికి ఇదే మందును అమ్మినట్లు చెబుతున్నారని ఇంకా ఎవరికైనా ఈ రకమైన సమస్యలే వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని అదే విధంగా మామిడి తిరుమలేష్ గౌడ్ రైతు వాడిన పురుగు మందుకు సంబంధించిన పరిశీలనలో పురుగుమందు నాణ్యత ప్రమాణాలు ఉన్నవి లేనవి తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇంకా మండల కేంద్రంలో ఎన్నడు బీటీ త్రీ పత్తి విత్తనాలు అమ్మలేదని కొందరు రైతులు బయటి ప్రాంతాల నుండి తెచ్చుకొని వేసుకున్నారని ఆ బయటి ప్రాంతాల వారే రైతులకు గడ్డి మందులు సప్లై చేశారని అన్నారు. గడ్డి మందు అమ్మకం పంటలు లేని ప్రాంతాలలోనే సంవత్సరంలో ఆరు నెలలు మాత్రమే అమ్మాలనే రూలు ఉన్నదని అంతకుమంచి అమ్మకూడదని తెలిపారు.

# వైరా మండలంలో 2574 యూరియా బస్తాలు నిల్వ

-రైతులకి ఎలాంటి యూరియా ఇబ్బంది లేదు
-వ్యవసాయ అధికారి నయాన్ మంజుఖాన్






**ప్రజాపక్షం/వైరా:** వైరా మంలంలో 2574 యూరియా బస్తాల నిల్వ ఉందని వైరా మండల వ్యవసాయ అధికారి నయాన్ మజంపఖాన్ తెలిపారు. శుక్రవారం యూరియా నిల్వలు గురించి ప్రజాపక్షం అడుగగా ప్రజాపక్షంతో మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ మాట్లాడుతూ వైరా మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం యూరియా పెద్ద ఎత్తున సరఫరా చేస్తుందని అన్నారు. మండలంలో గరికపాడు 600, వైరా 323, సిరిపురం 250, గొల్లపూడి600, విప్పలమడక 800 బస్తాలు యూరియా అందుబాటులో ఉందని, ఎక్కడా కూడా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని, గ్రామాల వారీగా రైతులకు ముందుగానే ఒక రోజు కూపన్లు అందజేసి నిల్వ ఉన్న కేంద్రాల్లో యూరియా సరఫరా చేస్తున్నామని ప్రతి రైతుకు ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మండలంలో యూరియా నిల్వలు గురించి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రతిరోజు వ్యవసాయ అధికారులతో మాట్లాడుఉతన్నారని, ఎక్కడ ఎలాంటి ఇబ్బంది కలగవద్దని సూచనలు చేశారని రైతులు ఆందోళన చెందవద్దని, సరిపడా నిల్వలు యూరియా అందుతుందని తెలిపారు.

# ద్రోహులను వదిలిపెట్టం

-హిడ్మా మృతికి దుర్గాప్రసాద్ కారణం -విప్లవ పేరిట మావోయిస్టుల లేఖ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** విప్లవ ద్రోహులను వదిలిపెట్టేది లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) హెచ్చరించింది. హిడ్మా మృతికి అధికార పార్టీకి చెందిన చర్ల మండల వాసి నల్లపు దుర్గా ప్రసాద్ కారణమని అతనిని వదిలిపెట్టేది లేదని లేఖలో మావోయిస్టులు హెచ్చరించారు. విప్లవ పేరుతో మావోయిస్టులు ఒక లేఖను విడుదల చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను అంత మొందించి వేల ఎకరాల భూమిని మిట్టల్, రుంగ్టా స్టీల్, లాయిడ్ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆ లేఖలో ఆరోపించారు. ఇది గిరిజనులు, మావోయిస్టుల సమస్య కాదని దేశ సమస్యగా పరిగణించాలని లేఖలో మావోయిస్టులు కోరారు. ఈ మధ్య కాలంలో మావోయిస్టుల చేతిలో హతమైన కాంట్రాక్టర్ పార్టీని మోసం చేశాడని తప్పు ఒప్పుకున్నాడని అందుకే శిక్షించామన్నారు. హిడ్మాను మరికొందరు సభ్యులను మోసం చేసి మాయ మాటలు చెప్పి ఆసుపత్రికి తీసుకెళ్లిన కాంట్రాక్టర్ ఎవరో తమకు తెలిసిపోయిందని ఆ కాంట్రాక్టర్ వాయిస్ రికార్డు సైతం తమ దగ్గర ఉన్నాయని మావోయిస్టులు లేఖలో వెల్లడించారు. చర్లకు చెందిన నల్లపు దుర్గాప్రసాద్ హిడ్మాను దోకుపాడు మీదుగా కొండవాయి మార్గ మధ్యలో వాహనం ఉంచి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి శత్రువులకు అప్పగించాడని అటువంటి దుర్గాప్రసాద్‌ను వదిలిపెట్టబోమన్నారు. ప్రజల కోసం పనిచేసే మావోయిస్టు పార్టీకి ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావంతులు, జర్నలిస్టులు, పౌర హక్కుల సంఘాలు మద్దతు ఇవ్వాలని మావోయిస్టులు ఆ లేఖలో కోరారు.

# ఫుడ్ పార్క్ అక్రమాలపై విచారణ




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌లో చోటు చేసుకున్న అవినీతి ఆరోపణలపై ప్రజాపక్షంతో పాటు పలు పత్రికల్లో వచ్చిన కథనాలు తీవ్ర చర్చకు దారితీయగా, ప్రభుత్వం స్పందించింది. టీఎస్ఐఐసీ సెక్రటరీ శంశాక్ గోయల్ ఆదేశాల మేరకు సీనియర్ ఇంజినీరింగ్ అధికారి ఎస్ఈఈ నరేందర్ రెడ్డి శుక్రవారం తన బృందంతో ఫుడ్ పార్క్‌ను సందర్శించి క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫుడ్ పార్క్‌లో నిర్మించిన రోడ్లు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, వీధి లైట్లు, అమ్మోనియా ప్లాంట్, వాటర్ ట్యాంక్ తదితర మౌలిక సదుపాయాలను సుదీర్ఘంగా పరిశీలించారు. పనుల నాణ్యత, ఖర్చులు, వాస్తవ వినియోగంపై అధికారులు పలు అంశాలను లోతుగా పరిశీలించినట్లు సమాచారం. విచారణ అనంతరం ఎస్ఈఈ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఫుడ్ పార్క్‌లో చేపట్టిన పనులపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని స్పష్టం చేశారు. అవకతవకలు నిర్ధారణైతే చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయడంతో పాటు, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయాలని రికమండ్ చేస్తామని తెలిపారు.ఈ తనిఖీలో డీఈ స్మరత్ చంద్ర కూడా పాల్గొన్నారు. మెగా ఫుడ్ పార్క్‌పై వచ్చిన ఆరోపణలు నిజమైతే భారీ స్థాయిలో చర్యలు తప్పవన్న సంకేతాలు ఈ విచారణతో స్పష్టమవుతున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది.

# పెద్ద వెంకటాపురం పంచాయతీ అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా స్ఫూర్తితో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య ఆదేశానుసారం పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని సర్పంచ్ వజ్జ ఉమా అన్నారు. శుక్రవారం పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీలోని సింగారం గ్రామంలో, బాసవారి గుంపులో వీధిలైట్లు పెట్టించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికైన తరువాత పంచాయితీలో ప్రజ ల సౌకర్యం కోసం వీధి లైట్లు మొట్ట మొదటిగా పెట్టించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమరం రాజేష్, సిపిఐ మండల నాయకులు వజ్జ చిరంజీవి, తాటి నాగేష్, తాటి ఎల్లయ్య, వజ్జ రమేష్, కల్తీ సత్యనారాయణ, పడిగ శ్రీలత, కొమరం కృష్ణ, కండె రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# బీట్ ఆఫీసర్‌పై దుర్భాష

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి గ్రామానికి చెందిన కలప వ్యాపారిగా పని చేస్తున్న ఆకారపు వెంకటాచారి అతని ట్రాక్టర్ డ్రైవర్ సురేష్‌లపై కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం కూసుమంచి మండలంలో అటవీ శాఖలో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ వెంకటేశ్వరారవు తన డ్యూటీలో భాగంగా డిసెంబర్ 27న కిష్టాపురం నుండి ముత్యాలగూడెం మధ్యలో కలప మొద్దులను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా అదే రూట్‌లో వెళుతున్న బీట్ అధికారి వెంకటాచారిని అనుమతులు ఉన్నాయా అని విచారణ చేస్తున్న క్రమంలో బీట్ అధికారిపై వెంకటాచారి అతని డ్రైవర్ దుర్భాషలాడిరని, బీట్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# గ్రామాల వారీగా యూరియా పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం పుణ్యపురం, పూసలపాడు, గొల్లెనపాడు, లక్ష్మీ పురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో యూరియా పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఉదయం 6గంటల నుండి ఏఈవోలు ముందస్తుగా గ్రామాల్లో యూరియా కూపన్‌లు రైతులకి డిస్ట్రిబ్యూట్ చేయడం జరిగింది. తదనంతరం వెంటనే రైతులు సొసైటీలో యూరియా తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాని మండల వ్యవసాయ అధికారి , వైరా మండల తహశబుల్దార్ సిహెచ్. సురేష్, ఎంపిడివో బి.సక్రియ, వైరా సబ్‌ఇన్స్‌పెక్టర్ పుప్పాల రామారావు, పవన్‌లు పర్యవేక్షించారు. ఈ రోజు కూపన్స్ ద్వారా మండలంలో 1628 యూరియా బాగ్స్ డిస్ట్రిబ్యూట్ చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లు యంగలి మరియమ్మ, ఆళ్ళ వెంకట్రావు, నూతి వెంకట్రావు, వ్యవసాయ విస్తరణ అధికారులు వాసంతి, రాజేష్, కీర్తి, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.